క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సోమవారం రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 12వ వార్డుకు చెందిన ఆత్మకూరు హజరత్తయ్య, 13వ వార్డుకు చెందిన కోలా అశోక్, 15వ వార్డుకు చెందిన కల్లూరు వెంకట రమణమ్మ, 23వ వార్డుకు చెందిన దేవరకొండ సుబ్బారావులు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాలకు నగదు చెక్కులను అందజేశారు. ఆయన వెంట సోమవరపు యానాదిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు



ఉదయగిరి: పట్టణంలోని కోళ్లవీధి, నాగులబావి వీధి, అగ్రహారం, బ్రాహ్మణవీధి, దిలావర్‌భాయి వీధుల్లో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్తగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ ఫణికుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయా వీధుల్లోని రోడ్లను పరిశీలించారు. నిధులు మంజూరవగానే త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు రాజశేఖర్, వెంకటేశు, షరీఫ్, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా



సోమశిల: అనంతసాగరం మండలం మినగల్లు–రేవూరు గ్రామల మధ్యన ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. రేవూరుకు చెందిన రవీంద్రరెడ్డి ట్రాక్టర్‌లో సప్లయిర్స్ సామగ్రిని తరలిస్తుండగా మినగల్లు–రేవూరు గ్రామాల మధ్యన గుంతలు అధికంగా ఉండడంతో ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సప్లయిర్స్ సామగ్రి కొంత మేర ధ్వంసమైంది.

సీతారామలక్ష్మణుల విగ్రహాల నిమజ్జనం

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో జీర్ణోద్ధరణ గావించిన అనంత కోదండరామస్వామి ఆలయంలోని పాత సీతారామలక్ష్మణ విగ్రహాలను సోమవారం సముద్రంలో నిమజ్జనం చేశారు. తొలుత గ్రామంలో విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో విడవలూరు మండలం రామతీర్థంలోని సముద్రతీరం వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

దివ్యాంగులకు ఉపకరణాలు



ఉదయగిరి: కేంద్ర ప్రభుత్వ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ అయూబ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపునకు ప్రత్యేక శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించి అవసరమైన పరికరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించామని, త్వరలో వారికి మూడు చక్రాల వాహనాలు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, తదితర ఉపకరణాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ప్రత్యేకాధికారులు దేవి, సంధ్యారాణి, ఏఓ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

భూఆధార్‌కు దరఖాస్తు చేసుకోండి

దుత్తలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వర్తించేందుకు రైతులు భూఆధార్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్ వెంకటసుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూమి ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, 1బీ, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకు చేసిన మొబైల్ నంబరు సమర్పించి భూఆధార్ పొందాల్సి ఉంటుందన్నారు. రైతులకు ఏమైనా సందేహాలుంటే రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

ఆర్ఐ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆర్ఐగా పనిచేస్తున్న సురేంద్ర రామాయపట్నం పోర్టు సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు.

సొంత గూడు కరువు



ఈ ఫొటోలోనిది దుత్తలూరు మండలం ఏసీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం. భవనం శిథిలావస్థకు చేరినా ఇక్కడే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలోని అంగన్‌వాడీ కేంద్రం దుత్తలూరు సెంటర్‌లోనిది. సొంత భవనం లేక రేకుల ఇంటిని అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. అందులో కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. దానికి కూడా నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలని ఇంటి యజమాని ఒత్తిడి చేస్తున్నారు.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న చింతలపాళెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం

- శిథిల భవనాలు..అద్దె గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- కనీస సౌకర్యాలు లేక చిన్నారుల అవస్థ

దుత్తలూరు/జలదంకి: చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలలో కీలకపాత్ర పోషించే అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. సొంత భవనాలు లేక అద్దె గదుల్లో నిర్వహిస్తుండడం..కనీస వసతులు కరువవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు అవస్థ పడుతున్నారు. సొంత భవనాలు ఉన్నా శిథిలావస్థకు చేరడం..చిన్నారుల ప్రాణాలకు భద్రత లేకపోవడంతో తల్లిదండ్రులు వారిని కేంద్రాలకు పంపేందుకు విముఖత చూపుతున్నారు.

అద్దె భవనాల్లోనే..

ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి, వింజమూరు కేంద్రాలుగా ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 462 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 147 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన వాటిలో కొన్నింటిని సొంత భవనాలు, మరికొన్నింటి ప్రభుత్వ పాఠశాలలు, శిథిలావస్థకు చేరిన భవనాల్లోనూ నిర్వహిస్తున్నారు. జలదంకి మండలంలో 67 కేంద్రాలు ఉండగా, 13 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మరో 30 కేంద్రాలను శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, మిగిలిన వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

స్థలాలు లేక సతమతం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. కేంద్రం, ప్రపంచ బ్యాంకు ద్వారా నిధులు మంజూరవుతున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలు లేకపోవడంతో భవన నిర్మాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కనీస వసతుల లేమి

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక కనీస వసతుల లేమి కూడా వెంటాడుతోంది. అద్దె గదుల్లో కనీస వసతులు ఉండడం లేదు. అద్దె గదులు ఇరుకుగా ఉండడం..అందులోనే పోషకాహారం సరుకులు, ఇతర సామగ్రి భద్రపరచడం, అక్కడే వండి పెట్టడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడం వంటి పనులన్నీ చేపట్టాల్సి రావడంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో కనీసం పిల్లలు తిరగడానికి, ఆడుకోవడానికి కూడా స్థలం లేకపోవడం వారి శారీరక, మానసిక వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతోందని పలువురు నిపుణులు చెబుతున్నారు. అద్దె భవనాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, తదితర సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులతో పాటు కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు శిథిల భవనాల్లో చిన్నారుల ప్రాణాలకు భద్రత కొరవడుతోంది. వర్షం పడితే భవనాలు ఉరుస్తుండడంతో అందులోని సరుకులు తడిసి పనికి రాకుండా పోతున్నాయి. కొందరు అంగన్‌వాడీలు అద్దె గదులు తక్కువ విస్తీర్ణంలో ఉండడంతో కేంద్రాలకు వచ్చే సరుకులను తమ ఇళ్లలో నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు కేంద్రాలకు తెస్తున్నారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను సమకూర్చి చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	- 462
మెయిన్ కేంద్రాలు	- 393
మినీ కేంద్రాలు	- 69
అద్దె భవనాల్లో నడిచేవి	- 147
శిథిలావస్థకు చేరినవి	- 4

ప్రతిపాదనలు పంపుతున్నాం

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపుతున్నాం. జలదంకి మండలంలో 13 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపి ఉన్నాం. త్వరలో మూడు కేంద్రాలకు భవనాలు మంజూరు అవుతాయి. స్థలాలు ఉన్న చోట త్వరగా భవనాలు మంజూరయ్యే అవకాశం ఉంది. స్థలాలు లేని చోట సమస్యలు ఎదురవుతున్నాయి. కేంద్రాలకు ఆట వస్తువులను త్వరలో అందజేస్తాం.

– పద్మజాకుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ, వింజమూరు సెక్టార్

సొంత భవనాలు లేక ఇబ్బందులు



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోంది. వాటిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. కేంద్రాలకు స్థలాలు కేటాయించడంతో పాటు భవనాలను మంజూరు చేసి వసతులు కల్పించాలి.

–వీ కామేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, చింతపాళెం

భూసమస్యలపై వినతుల వెల్లువ



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీఓ బీ పావని

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు భూ సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై ఆర్డీఓ పావనికి వినతిపత్రాలను అందజేశారు. మొత్తం 20 అర్జీలు అందాయని ఆర్డీఓ తెలిపారు. ఆత్మకూరులోని పేరారెడ్డిపల్లికి చెందిన పలువురు తమకు గతంలో ప్రభుత్వం మంజూరుచేసిన భూమిని సాగు చేసుకుంటుండగా కొందరు అభ్యంతరం తెలుపుతున్నారని, సర్వే నంబర్లు పరిశీలించి తమకు సంబంధించిన భూమిని చూపాలని ఆర్డీఓను కోరారు. స్పందించిన ఆర్డీఓ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ సుధీర్‌ను ఆదేశించారు. అలాగే చేజర్ల మండలం చెల్లపనాయుడుపల్లికి చెందిన ఓ రైతు తన భూమిని టీడీపీ నాయకుడు ఆక్రమించాడని, 1బీ, అడంగల్‌లు మార్పు చేశారని ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కలువాయి మండలానికి చెందిన బ్రహ్మయ్య అనే రైతు రోడ్డు నిర్మాణానికి తన భూమిని తీసుకున్నారని, అందుకు సంబంధించి ఇప్పటి వరకు పరిహారం అందజేయలేదని, రెవెన్యూ సిబ్బంది పత్రాలు ఇచ్చేందుకు తిప్పుకుంటున్నారని విన్నవించారు. వాటిని పరిశీలించిన ఆర్డీఓ వెంటనే సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘ నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందించి ఆదుకోవాలని ఏపీ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ పావనికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించే పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించి అధికారుల ద్వారా నెల్లూరులోని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే రూ.500 అదనంగా రైతులకు చెల్లించాలని కోరారు. రైతుల పక్షాన ఈ నెల 22న నెల్లూరులో భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు సంఘ నాయకులు ఎల్ కృష్ణ ప్రసాద్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు బాధితులకు ఉచితంగా ఇంజక్షన్



మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో గుండెపోటు బాధితులకు తొలి గంటలో ఇచ్చే టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆ ఆస్పత్రి డీడీఓ కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన సీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడారు. గుండెపోటు వచ్చిన వారికి తొలి గంటలో అందించే చికిత్స చాలా కీలకమైందన్నారు. గుండెపోటు వచ్చిన వారికి టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా ఏడు గంటల వరకు ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. రూ.45వేల విలువ చేసే ఈ ఇంజక్షన్‌ను సీహెచ్‌సీలో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఎవరికైనా ఛాతీలో నొప్పి వస్తే గ్యాస్ట్రబుల్ అని నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గుండెపోటుగా తేలితే ప్రాణాలు కాపాడేందుకు ఇంజక్షన్ అందజేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్టీయూ మండల కన్వీనర్ల నియామకం



ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కావలి: కావలి విద్యాశాఖ డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించిన స్టేట్ టీచర్స్ యూనియన్ కన్వీనర్లు, కోకన్వీనర్లను సోమవారం నియమించారు. ఎస్టీయూ నాయకుడు ఎం సుదర్శనం ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన సమావేశంలో కావలి రూరల్ మండలానికి కన్వీనర్‌గా వై సురేష్ కో కన్వీనర్లుగా ఏ రామారావు, ఎం సునీల్‌ను నియమించారు. అలాగే కావలి టౌన్‌కు కన్వీనర్‌గా జీ రవి,కో కన్వీనర్‌గా ఎస్‌కే ఖాదర్‌బాషా, కలిగిరి మండలానికి కన్వీనర్‌గా కే రాజకుమార్,కో కన్వీనర్‌గా ఆర్ పోలయ్య, జలదంకి మండలానికి కన్వీనర్‌గా ఈ హరిబాబు, వింజమూరు మండలానికి కన్వీనర్‌గా ఏ రాజు, ఏఎస్ పేట మండలానికి కన్వీనర్ గా ఎం మోజస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు యూనియన్‌లో చేరారు. అనంతరం ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు రాజమనోహర్, ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి నరసింహ, రాజ్‌కుమార్, రాజు, సురేష్, సునీల్, హరిబాబు, రవి, ఖాదర్‌బాషా మాల్యాద్రి,రామారావు, కాంతారావు, మోజస్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు అడ్డగింత



సోమశిల: అనంతసాగరంలో నూతన మద్యం దుకాణం ఏర్పాటును స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే..అనంతసాగరంలో ఇప్పటికే ఒక మద్యం దుకాణం ఉంది. ప్రభుత్వం కొత్తగా గౌడ్స్‌కు కేటాయించిన మద్యం దుకాణాన్ని గతంలోని మద్యం దుకాణంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్యన వాగ్వాదం నెలకొంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ జనావాసాలు, గుడి, బడి సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతారని తెలిపారు. ఇప్పటికే ఒక షాపు ఉండగా, మరోషాపు ఏర్పాటు చేయడం మంచిది కాదని ఆందోళన వ్యక్తం చేశారు.

12 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు

అనుమసముద్రంపేట: ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

19 నుంచి ఎంజీఆర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ యువత ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి రెండ్రోజుల పాటు ఎంజీఆర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10116, ద్వితీయ బహుమతిగా రూ.7116, తృతీయ బహుమతిగా రూ.5116, 4వ బహుమతిగా రూ.3,116 నగదుతో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వివరాలకు 79970 02558, 63007 33074 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రఘునాథ్

వరికుంటపాడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రఘునాథ్ సూచించారు. మండలంలోని కనియంపాడులో పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. సీసీకెమెరాలతో నేరాలను కట్టడి చేయవచ్చని, ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే తమకు సమాచారం అందజేయాలని కోరారు.

గీత కార్మికులపై ఎక్సైజ్ ఉక్కుపాదం

సంగం: కల్లు గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించి వారిని ఆదుకుంటున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వారిని చిన్నచూపు చూస్తున్న విషయం బహిర్గతమవుతోంది. సంగం మండలంలోని దువ్వూరు, సిద్దీపురం, పడమటిపాళెం, సంగం తదితర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా కల్లు గీత కార్మికులు జాతీయ రహదారికి కూతవేటు దూరంలో చెట్ల కింద కల్లు అమ్మకాలు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాళెం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కిషోర్ గత కొన్ని రోజులుగా జాతీయ రహదారి పక్కన కల్లు దుకాణాలు పెట్టొద్దని ఆంక్షలు విధిస్తూ వస్తున్నారు. సోమవారం గ్రామాల్లోనే కల్లు అమ్మకాలు సాగించాలని ఆదేశించారు. తాము ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడే అమ్మకాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నామని, తమ పొట్టకొట్టొదని గీత కార్మికులు ప్రాధేయపడినా కనికరించలేదు. కల్లు దుకాణాలు తరలించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం గీత కార్మికులు స్థానిక విలేకరులకు ఫోన్ చేసి వారి బాధలు చెప్పుకున్నారు.

గ్రీవెన్స్‌డేకు అధికారుల డుమ్మా



వింజమూరులో ఇద్దరే అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

ఉదయగిరి: ప్రభుత్వం ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కారించే నిమిత్తం ప్రతిసోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోంది ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని 17 శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలి. ఆయా శాఖలకు సంబంధించి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కారం చూపాలి. కానీ ఈ తంతు ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కడా జరగడం లేదు. దాదాపు అన్నీ మండలాల్లో గ్రీవెన్స్‌డేకు ఎక్కువ మంది అధికారులు డుమ్మా కొడుతున్నారు. దీంతో అరకొరగా వచ్చే అర్జీదారులకు కూడా న్యాయం జరగడం లేదు. సోమవారం వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ,డీటీ శ్రీనివాసులు మాత్రమే హాజరై కనిపించారు. ఇతర శాఖల అధికారులు ఎవరూ రాలేదు.ప్రతి వారం ఇదే తంతు జరుగుతున్నా పర్యవేక్షణ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రీవెన్స్‌డే ప్రహసనంగా మారింది.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సంగం సీఐ వేమారెడ్డి

ఆత్మకూరు: విద్యార్థినులు లైంగికదాడులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై సోమవారం సాయంత్రం ఆయన అవగాహన కల్పించారు. ఇటీవల జిల్లాలో ఓ విద్యార్థినిపై వ్యాన్ డ్రైవర్, మరో యువకుడు లైంగికదాడికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా, ఎవరి ప్రవర్తనైనా అనుమానాస్పదంగా ఉన్నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు శ్రీహరి, పీఈటీ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని శ్రీకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సంగం సీఐ వేమారెడ్డి అవగాహన కల్పించారు. విద్యార్థినులు లైంగికదాడులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వెంటనే తమ తల్లిదండ్రులు, సన్నిహితులు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్సై సైదులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను విలీనం చేయొద్దని ఆందోళన



సోమశిల: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ముత్తుకూరు గ్రామస్తులు



సంగంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

సంగం/సోమశిల: ప్రభుత్వం సంస్కరణల పేరుతో చేపడుతున్న పాఠశాలల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. విలీన ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంగంలోని ఆర్‌ఎస్ ప్రాథమిక పాఠశాలలోని 3 ,4,5 తరగతులను వేరే పాఠశాలకు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. 34 మంది విద్యార్థులను వేరే పాఠశాలకు తరలించడం సరికాదని మండిపడ్డారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం హెడ్ మాస్టర్, ఎంఈఓ, ఎంపీడీఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పావని, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగరం మండలం ముత్తుకూరు పాఠశాలలో 3, 4, 5 తరగతులను పాతదేవరాయపల్లి పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతారని, డ్రాపౌట్స్‌గా మారే ప్రమాదం ఉందని పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని సిబ్బందికి రోడ్డు భద్రతా నియమాలపై ఆత్మకూరు ఎంవీఐ రాములు సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషా సుందరి, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండాజోల్‌తో నులిపురుగులకు చెక్



కావలి: నులిపురుగులతో రక్తహీనత తలెత్తుతుందని, 1 నుంచి 19 ఏళ్లలోపు వారితో ఆల్బెండాజోల్ మాత్రలను మింగించడం వల్ల నులిపురుగులను నివారించవచ్చని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పీ బ్రిజిత తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తుమ్మలపెంటలోని గురుకుల పాఠశాలలోని విద్యార్థినులతో సోమవారం ఆమె ఆల్బెండాజోల్ మాత్రలను మింగించారు. తుమ్మలపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏ అనిల్‌కుమార్ ,సహాయక సిబ్బంది భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.